సున్నా వడ్డీ పథకంతో మహిళలకు అదనపు రాబడి

- 9,473 మందికి రూ.3,28,57,266 లబ్ధి
- డ్వాక్రా సంఘాలకు ఏటా వడ్డీ జమ

ఏలూరు రూరల్ : ప్రభుత్వం అమలు చేస్తున్న సున్నా వడ్డీ పథకం మహిళల ఆర్థిక స్వావలంబనకు ఉపయోగపడుతోంది. క్రమం తప్పకుండా ప్రభుత్వం సున్నావడ్డీ చెల్లించడంతో డ్వాక్రా సంఘాల మరింత బలోపేతమవుతున్నాయి. సంఘ సభ్యులు తీసుకున్న రుణంపై బ్యాంకులకు పావలా వడ్డీ చెల్లించాలి. ఈ వడ్డీని ప్రభుత్వం సున్నా వడ్డీ పేరుతో మహిళల ఖాతాలకు జమ చేస్తోంది. ఫలితంగా మహిళలు తీసుకున్న రుణం మాత్రమే బ్యాంకులకు వాయిదాల పద్ధతిలో చెల్లిస్తున్నారు. ఫలితంగా మహిళలపై వడ్డీ భారం తగ్గింది. దీనివల్ల ప్రతి మహిళ తీసుకున్న రుణం ఆధారంగా కనీసం రూ.10 వేల నుంచి రూ.20 వేలు వరకు మినహాయింపు పొందుతున్నారు. ఈ పథకం సంఘాలతో పాటు బ్యాంకింగ్ వ్యవస్థకు వెనుదన్నుగా మారింది. 2019 ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అధికారులు సున్నా వడ్డీ పథకం అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకు మూడు దఫాలుగా సభ్యులకు తీసుకున్న రుణాలకు సున్నా వడ్డీ జమైంది. ఏలూరు రూరల్ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో మొత్తంగా 9,473 మంది సున్నా వడ్డీ లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ. 3,28,57,266 అందజేసింది. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హయాంలో రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి తీవ్ర కాలయాపన చేసి డ్వాక్రా సంఘాలను అప్పుల ఊబిలో ముంచేశారు. ఫలితంగా బ్యాంక్ మేనేజర్లు రుణంతో పాటు వడ్డీ చెల్లించాలని మహిళలకు నోటీసులు పంపించారు. దీంతో గత్యంతరం లేక పేరుకుపోయిన వడ్డీ చెల్లించలేక లబ్ధిదారులు నానా అగచాట్లు పడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ అమలు చేస్తూ క్రమం తప్పకుండా సున్నా వడ్డీ చెల్లిస్తున్నారు. దీంతో డ్వాక్రా సంఘాల సభ్యులకు కొండంత ధైర్యం వచ్చింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో మొత్తంగా డ్వాక్రా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నారు. ఇప్పటికే ఆసరా పథకం ద్వారా 5,873 మంది మహిళలు రూ.19,32,53,444 అందుకున్న సంగతి తెలిసిందే.


ఏలూరు రూరల్ గ్రామాల్లో సున్నా వడ్డీ లబ్ధిదారులు

మహిళలకు మేలు జరిగింది



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు చాలా మేలు జరిగింది. మా డ్వాక్రా సంఘం రుణం డబ్బులు సగానికి పైగా చెల్లించారు. సున్నా వడ్డీ సైతం మా ఖాతాల్లో జమ చేస్తున్నారు. కరోనా సమయంలో బ్యాంకులకు రుణం చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. అప్పు ఇచ్చే నాథుడే లేడు. అలాంటి సమయంలో సీఎం జగన్ డబ్బులు ఇస్తారనే ధైర్యం మాలో కలిగింది. లేకపోతే చాలా ఇబ్బందులు పడేవాళ్లం.

– బలే రాజేశ్వరి, పెదయాగనమిల్లి

మాట నిలబెట్టుకున్నారు



ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. మా డ్వాక్రా సంఘం తీసుకున్న రుణం, పావలా వడ్డీ డబ్బులు ఏటా జమ చేస్తున్నారు. దీని వల్ల మా సంఘం సభ్యులు సుమారు లక్ష రూపాయలు లబ్ధి పొందారు. మాకు చాలా సంతోషంగా ఉంది. ఇవే కాకుండా వైఎస్సార్ సీపీ పాలనలో సంక్షేమ పథకాలన్నీ మహిళ పేరున మంజూరు చేయడంతో ఆనందంగా ఉంది.

– జి వెంకటేశ్వరమ్మ, పెదయాగనమిల్లి

గ్రామాల వారీగా డ్వాక్రా సంఘాల సభ్యులు పొందిన సున్నా వడ్డీ (రూపాయల్లో)

చాటపర్రు– రూ.58,15,014, పైడిచింతపాడు– రూ.22,53,758, ప్రత్తికోళ్లలంక–రూ.14,84,539, కోటేశ్వరదుర్గాపురం–రూ.11,30,694, కోమటిలంక–రూ.14,17,285 , శ్రీపర్రు–రూ.58,22,359, పెదయాగనమిల్లి– రూ.5,73,106, గుడివాకలంక– రూ.29,73,853, జాలిపూడి–రూ. 47,66,985, మల్కాపురం– రూ.25,84,197, మాదేపల్లి–రూ.40,35,476

క్లుప్తంగా

సేవా గుణం అలవరుచుకోవాలి


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీధర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవరుచుకోవాలని ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఏలూరు స్మార్ట్ సిటీ, స్మార్ట్ ఫార్మర్స్, స్మార్ట్ ప్రొఫెషనల్స్, టౌన్ లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఈ ఏడాది జూలై నుంచి నిర్వహిస్తోన్న మధ్యాహ్నం అన్నదానానికి రామచంద్ర ఇంజినీరింగ్ కాలేజ్ సీఎస్‌ఈ ఏఐ ఎంఎల్ విభాగ విద్యార్థులు 10 రోజుల పాటు స్పాన్సర్ చేయటానికి ముందుకొచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీ శ్రీధర్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఆసుపత్రిలోని ప్రసూతి, శిశు ఆరోగ్య కేంద్రంలో 300 మందికి ఆహారంతో పాటు వాటర్ బాటిల్, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎంఆర్‌డీ బలరాం, 20వ డివిజన్ ఇన్‌చార్జి జీహెచ్‌డీ ప్రసాద్, రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల సీఎస్‌ఈ ఏఐఎంఎల్ హెచ్‌ఓడీ బి.శారద, అసోసియేట్ ప్రొఫెసర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోలపై ఈ–చలానాలు రద్దు చేయాలి


సీఐ ప్రసాద్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఆటోలపై ఇష్టానుసారంగా విధిస్తున్న ఈ–చలానాలను రద్దు చేయాలంటూ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్పందనలో జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్య వేణికి, ట్రాఫిక్ సీఐ కేవీఎస్‌వీ ప్రసాద్‌లకు యూనియన్ నాయకులు వినతి పత్రం అందించారు. నగరంలో స్టాప్ లైన్ వైలేషన్ పేరుతో ఆటోలపై వేలాదిరూపాయలు ఫైన్లు విధించారని పేర్కొన్నారు. ప్రధాన సిగ్నల్ పాయింట్లు పాత బస్టాండ్, ఫైర్ స్టేషన్ ప్రాంతాల్లో అమర్చిన సీసీ కెమెరాలు లోపభూయిష్టంగా ఉన్నాయని, వాటిని సరైన దిశలో అమర్చకుండా వాహనాలపై ఫైన్లు విధించడం సరికాదని తెలిపారు. స్టాప్ లైన్ వైలేషన్ ఫైన్లకు ఎటువంటి ఫొటో ప్రూఫ్‌లు ఉండటం లేదని పేర్కొన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ పరిశీలన చేయించి ఆటోలపై ఉన్న చలానాల రద్దుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి, సీఐటీయూ నాయకులు పి.కిషోర్ పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు


జనార్దన స్వామి ఆలయంలో సహస్రదీపోత్సవ సేవ చేస్తున్న అర్చకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారం జనార్దన, నగరేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 24న ప్రారంభమైన భూనీళా సమేత జనార్దన స్వామి, రంగనాయక స్వామి వార్ల పవిత్రోత్సవాలు సోమవారం ముగిశాయి. సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవ, నిత్యార్చన చతుస్థానార్చన, మండలారాధాన, మహాపూర్ణాహుతి, కుంభ ప్రదక్షిణ, ప్రోక్షణ, పవిత్ర విసర్జన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పరివార సహిత స్నపనము, చక్రస్నానం కార్యక్రమాలు నిర్వహించి ఆరగింపు, మంగళాశాసనం, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి స్వామివారికి సహస్రదీపాలంకరణ సహిత ఊంజల్ సేవ నిర్వహించారు. సేవాకాలం, రుత్విక్ సన్మానం, ఆరగింపు, మంళాశాసనం, తీర్థ ప్రసాద వినియోగం చేసి అనంతరం ఏకాంత సేవ నిర్వహించారు. అర్చకులు వంగల పవన్ కుమార్ విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి పెద్దింట్ల రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు


పాత శివాలయంలో స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు


ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగించిన భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కార్తీక మాసం రెండో సోమవారం పర్వదినం సందర్భంగా నగరం శివనామస్మరణతో మార్మోగాయి. పలు శైవక్షేత్రాల్లో విశేష పూజలు చేశారు. స్థానిక పత్తేబాద శ్రీ చౌడేశ్వరి రామ లింగేశ్వర స్వామి దేవస్థానంలో పూర్వాషాడ నక్షత్రంతో నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం మహన్యాస పూర్వక అభిషేకాలు నిర్వహించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం ఆకాశదీప పూజ చేసి స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు కొడమంచిలి లక్ష్మణరావు పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు కార్యక్రమాలు పర్యవేక్షించారు. దొండపాడు శ్రీ నందత్తనాథ క్షేత్రంలో వేంచేసియున్న సర్వదోష పరిహారక విశ్వేశ్వర స్వామి వారికి ఉదయం మహన్యాస పారాయణ, లఘున్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకాలు, విశేష అలంకరణ, అర్చన చేశారు. సాయంత్రం ప్రదోషకాల అర్చన, రుద్ర త్రిశతి నామార్చన, బిల్వార్చన, శివ సహస్రనామ పారాయణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. అర్చకులు ఘంటసాల రామకృష్ణ విశేష పూజలు చేయగా, వ్యవస్థాపక ట్రస్టీ వేణుగోపాల్ లునాని, కార్యదర్శి కాకి బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు. శనివారపుపేట శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవర్‌పేట కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో తెల్లవారు జాము నుంచి భక్తుల గోత్రనామాలతో స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు. అన్నపూర్ణ అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి విశేష అలంకరణ చేసి, ఆకాశదీప పూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించి విశేష హారతి సేవ చేశారు. ఆలయ అర్చకుడు కందుకూరి రామబ్రహ్మానంద శర్మ పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి ఎం రామాంజనేయులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.


ప్రత్యేకాలంకరణలో స్వామివారు

శ్రీవారికి సహస్రదీప సేవ


గరుడవాహనంపై శ్రీవారికి ప్రాకార ప్రదక్షిణోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా శ్రీవారికి సహస్ర దీప సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించి విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు చేసి, స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామి వారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి వారికి సాయంకాల పూజలు చేసి, గరుడవాహనంపై ప్రాకార ప్రదక్షిణ చేశారు. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు ప్రత్యేక పూజలు చేయగా, ఆలయ ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ధర్మకర్తలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు పర్యవేక్షించారు.

కళాశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు


ప్రతిభ కనబరిచి సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక కోటదిబ్బ జూనియర్ కళాశాలలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. క్విజ్‌లో పాల్గొన్న వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఏలూరు నగర కోఆర్డినేటర్ బలే సురేష్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

జాబ్ మేళా పోస్టర్ విడుదల


జాబ్ మేళా పోస్టర్ విడుదల చేసిన ఎమ్మెల్యే బాలరాజు, తదితరులు

బుట్టాయగూడెం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 30న నిర్వహించే మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని దుద్దుకూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన జాబ్‌మేళా పోస్టర్‌ను సోమవారం బాలరాజు విడుదల చేశారు. పోలవరం నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించేందుకు సుమారు 18 కంపెనీలు పాల్గొంటున్నాయని బాలరాజు చెప్పారు. ఐటీడీఏ పీఓ ఎం సూర్యతేజ మాట్లాడుతూ గిరిజన ప్రాంత నిరుద్యోగులకు ఈ జాబ్ మేళా ఒక వరమన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందని, సుమారు 1600 మందికి ఉపాధి కల్పించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీడాప్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	36	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	64–72
వంకాయలు (కాంతులు)	50	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07–10
బెండకాయలు	32	కంద	60
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	40
కాకర కాయలు	30–34	కీరా దోస	44
బీరకాయలు	28	ఫ్రెంచ్‌బీన్స్	92
బీరకాయలు (పందిరి)	48	అల్లం	120
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	48	పాలకూర	10
దొండకాయలు	28	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	45–55	గోంగూర	06
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	26	బఠాణి	--
ఆనబకాయ (1)	20–25	క్యాప్సికమ్	52
పొట్లకాయ(1)	15–20	చిలకడదుంప	34

టూ టౌన్ సీఐగా ప్రభాకర్‌రావు



ఏలూరు టౌన్: నగరంలో శాంతిభద్రతలు కాపాడేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని టూ టౌన్ సీఐ ఎం ప్రభాకర్ రావు అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయనను సీఐగా నియమిస్తూ ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం సీఐగా పని చేస్తున్న పి.చంద్రశేఖర్‌ను వీఆర్‌కు తరలించారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన ప్రభాకరరావు 2009 ఎస్సై బ్యాచ్‌కు చెందినవారు. 2018లో ఆయనకు సీఐగా ఉద్యోగోన్నతి లభించింది. అనంతరం ఆయన కృష్ణాజిల్లాలోని నున్న, మాచవరం పోలీస్ స్టేషన్లో పనిచేశారు. ప్రస్తుతం ఆయన విజయవాడ నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా ఏలూరు నగరంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు.

మోదీని గద్దెదింపే వరకు ఉద్యమం

ఏలూరు (టూటౌన్): కార్మిక, రైతు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు దేశవ్యాప్త పోరాటంలో భాగంగా సోమ, మంగళ వారాల్లో విజయవాడలో నిర్వహించే మహాధర్నాకు ఏలూరు జిల్లా నుంచి ఏఐటీయూసీ, బీకేఎంయూ నాయకులు తరలివెళ్లారు. స్థానిక పవరుపేట రైల్వేస్టేషన్‌లో సోమవారం బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసి నగర అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు మీడియాతో మాట్లాడారు. కార్మికులు, రైతుల, వ్యవసాయ కూలీల హక్కులను కాలరాస్తున్న మోదీని గద్దె దింపే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. సీపీఐ, ఏఐటీయూసీ, బీకేఎంయూ నాయకులు పాల్గొన్నారు.

బయలుదొడ్డి ఆక్రమణపై ఆందోళన

ఏలూరు (టూటౌన్): ఆక్రమణకు గురైన ఎస్సీలకు చెందిన బహిర్ భూమి దొడ్డిని తమకు అప్పగించాలంటూ ఉంగుటూరు మండలం బాదంపూడి గ్రామానికి చెందిన ఎస్సీలు అంబేడ్కర్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం స్పందన కార్యక్రమంలో జేసీ బి.లావణ్యవేణికి వినతి పత్రం అందించారు. ఎన్నో ఏళ్లుగా గ్రామంలో ఎస్సీలు బహిర్భూమిగా వినియోగిస్తున్న స్థలాన్ని కొందరు ఆక్రమించుకోవడంతో ఇబ్బందులు పడుతన్నామని పేర్కొన్నారు. ఎస్సీ యువకులు, మహిళలు, అంబేడ్కర్ సొసైటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ మృతి

ఏలూరు టౌన్: ట్రాక్టర్ బ్లేడుతో లాటు ఊకను తీసి లారీలో వేసే సమయంలో ఊకలాటు ట్రాక్టర్ పైపడి ఊపిరాడక డ్రైవర్ మృతి చెందాడు. ఉంగుటూరు మండలం ఎర్రమిల్లిపాడుకు చెందిన దాసరి శ్రీను (35)కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవిస్తున్నారు. తన గ్రామం నుంచి ఏలూరు సమీపంలోని వట్లూరు – భోగాపురం రోడ్డులో ఉన్న ఒక రైస్ మిల్లు వద్ద సోమవారం సాయంత్రం ట్రాక్టర్ బ్లేడుతో శ్రీను ఊకను తీసి లారీలో వేసే సమయంలో ఊకలాటు అకస్మాత్తుగా ట్రాక్టర్ పై పడిపోయింది. తోటి కార్మికులు అతనిని ఊకనుంచి బయటకు తీశారు. అప్పటికే అతను కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా ఏలూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి మృతి చెందాడని నిర్ధారించారు. ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

విద్యార్థి కమలేష్ మృతిపై విచారణ చేయాలి


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): ఇటీవల పెదవేగి గురుకుల పాఠశాలలో అనుమానాస్పదంగా మృతి చెందిన విద్యార్థి దాసి కమలేష్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని, దీనికి బాధ్యులైన ప్రిన్సిపాల్, వార్డెన్‌లను తక్షణం సస్పెండ్ చేయాలని కోరుతూ ఏలూరు కలెక్టరేట్ వద్ద విద్యార్థి కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకులు సోమవారం ధర్నా చేశారు. స్పందనలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు దాసి వెంకటేశ్వరరావు, రూతి మాట్లాడారు. ఈనెల 20వ తేదీ రాత్రి 10.30 గంటలకు తమ కుమారుడు కమలేష్ పాఠశాల ఆవరణలో అనుమానాస్పదంగా మృతి చెందితే రాత్రి 12.30 గంటలకు తమకు సమాచారం ఇచ్చారని చెప్పారు. తాము వచ్చే టప్పటికే మృతదేహాన్ని మార్చురీకి తరలించారని, తాము చూసేందుకు అనుమతించకపోవడం పలు అనుమానాలకు తావిచ్చిందని తెలిపారు. పాఠశాల సిబ్బంది పొంతన లేని సమాధానాలు చెప్పారని ఆరోపించారు. మాలమహాసేన జాతీయ అధ్యక్షుడు ఆలగా రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థి కమలేష్ మృతికి బాధ్యులైన ప్రిన్సిపాల్, వార్డెన్‌లను తక్షణం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు సరిపల్లి పెద్దిరాజు, నల్లమెల్లి శంకర్, జి.కుమార్ రాజు, జి.రవి, కె.దిలీప్, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	36
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	36
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	15
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	26
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	23
ద్వారకాతిరుమల –ఏలూరు– బీహెచ్‌ఈఎల్	22.15	4822	15
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –తిరుపతి	16.00	4830	33